కవితా కౌముది

# మా గణితం మా’స్టారు’ పవన్ కుమార్ గజవల్లి

Sine అంటాడు, Cos అంటాడు
π అంటాడు, e అంటాడు
Step అంటాడు, Mod అంటాడు
Log అంటాడు, Power అంటాడు
మా గణితం మా స్టారు
ప్రశ్నలనే ప్రశ్నిస్తాడు, Rigor కోసమే తానంటాడు
Fallacy లనే చెపుతుంటాడు, Paradox లు సృష్టిస్తాడు
కోణాల్లోనే చూస్తుంటాడు, ఆకాశంలో రాస్తుంటాడు
కాలం కల్పన కాదంటాడు, విశ్వం మితి 4 అంటాడు
దీర్ఘవృత్తమై దీపిస్తాడు, పరావలయమై పయనిస్తాడు
సంఖ్యలనే పూజిస్తాడు, లెక్కించకనే లెక్కిస్తాడు
ఏమీ లేదనవద్దంటాడు, సున్నా వుందనమంటాడు
సంఖ్యల సాంద్రత నిజమంటాడు, సంఖ్యలె వేదం అంటాడు
తెలియనిదేమో X అంటాడు, తెలిసినదంతా Y అంటాడు
Y తో X ని రప్పిస్తాడు, దాగిన సత్యం చూపిస్తాడు
చూడక లోతులు చూసొస్తాడు, కొలవక ఎత్తులు కొలిచేస్తాడు
నీడల వడులు కట్టేస్తాడు, జాడల జీవం పట్టేస్తాడు
తిరగకనే తిరిగొస్తాడు, విశ్వం కొలతలు చెప్పేస్తాడు
లెక్కించకనే లెక్కిస్తాడు, లోపాలన్నీ చూపిస్తాడు

మిథ్యా లోకం వుందంటాడు, వాస్తవ లోకం మనదంటాడు
యూలర్ గారిని పిలిపిస్తాడు, i లో దానిని చూపిస్తాడు
వాస్తవ లోకం, మిథ్యా లోకం
గజి బిజి బిజి గజి మాస్టారు, గందరగోళం మాస్టారు
పొడవు వెడల్పు ఎత్తుల భాష, ఫార్ములా లంటూ ఎపుడూ గోల
వ్యాసార్ధాలు, వైశాల్యాలు, కోణాలు, ఘనపరిమాణాలు
ఆల్ఫా బీటా గామా లంటూ ఏవో రాతలు రాస్తుంటాడు
గీతలు గ్రాఫులు గీస్తుంటాడు, గాలిలో మేడలు కడుతుంటాడు
నలుపును తెలుపును ప్రేమిస్తాడు
నలుపును తెలుపుగ మారుస్తాడు
తెలుపుతో నలుపును దులిపేస్తాడు
తెలుపులో దాగిన రంగులనన్నీ చూపిస్తాడు
Russel గారి మేథమేటిక, Hardy గారి సంఖ్యా శాస్త్రం
Hall and Stewens జ్యామితి గీత, S L Loney కంప్లీట్ వర్కు
Leibniz, Newton కలన గణితము, Smith గారి శాంకవజాలు
ఎట్సెట్రాలు, ఎట్సెట్రాలు చదవాలంటూ చదివిస్తాడు
గణిత లోకమే మా మాస్టారు, పిచ్చి మాలోకం మా మాస్టారు
వరమేమని దైవమడిగితే సుద్ద ముక్క చాలంటాడు
నల్ల బోర్డు ఇమ్మంటాడు, వెర్రి బాగులా మాస్టారు
మా బంగారు గణితం మాస్టారు,
మా గణితం బంగారు మా ‘స్టారు’

★★★

# ఆత్మకథే వ్రాసుకుంటే

గాదిరాజు మధుసూదన రాజు

ఆవిష్కృతమౌతూన్న
ఆత్మీయామృత
సమర్పణం – అయ్యుండాలి!
ఆలోచనలను మానిన
అతివేగపుటవనికి
అనుభవమిచ్చిన
సాక్ష్యపుచుఱుకై యుండాలి!
దుడుకుప్రమాదత్రుటిలో
అదో
మనశ్శాంతి దూతై స్ఫురించాలి!
తెగుతున్న ఆత్మీయబంధాల్ని
అతుకగల్గిన
ఐక్యసంధాతై తరించాలి!

అంతేగాని....

ఆసాంతం
అదో సొంతసోది కారాదు!
తననుతాను
పొగుడుకొనే..
పొడుగుకాగితప్పుటల
పొత్తమైపోరాదు!!
ఐతేగియ్తే......
అందమైన
సానుకూలపుటంచనాల్ని
అల్లకల్లోలంచేసిన
అనుభవాల్నేరుకొన్న అనుభూతమై రావాలి
పరిష్కారమార్గాల కోసం..

నిరంతరంగా
అంతరంగంలో
ఆలోచనలగుంపు టేబుల్  సమావేశాల్ని
సంకల్పించుకొన్న ఆత్రమై రావాలి
అనేకానేకంగా
స్మరించుకొని
ముగించుకొంటూ....
పునఃపునః
సారాంశాల్ని
గ్రహించుకొంటూ
గ్రహించుకొన్నవాటిని
తలంచుకొంటూ
గుర్తుంచుకొన్న వాటిని
అక్షరాలరూపంలో
అచ్చొత్తి తెచ్చిన నివృత్తి రహస్యనిధియయ్యుండాలి

తొలిసారి ఇల్లొదిలిపోతున్న
తనచిన్నకన్నబిడ్డకు జాగ్రత్తలు నేర్పడంకోసం...
తహతహలాడుతూ
తల్లిపడే తపన సమస్తం

ఇందున నిక్షిప్తంఅయ్యిందా
అన్నట్లుండాలి!
అదో తపఃఫలమయ్యుండాలి!!

★★

# నేస్తమా

అర్చన కోవూరు

వ్యక్తపరుచు నేస్తమా
నీ గొంతునున్న భావన
అక్షరాలు మరువక
చక్షితాలు మెరవగా
బిడియాన్నే విడువగా
లోకానికె బెదరక
కన్న కలల సాక్షిగా
కాలాన్నే మరువగా

దాచుకున్న ఆర్తిని
దోచుకున్న మనసుని
నిద్ర లేని రాత్రులని
కూడు తినని పొద్దుల్ని
తెలివి లేని తనువుని
చెప్పలేని భాధని
మాట రాని మౌనాన్ని
పట్టలేని ప్రాయాన్ని
అదుపు లేని ఆశల్ని
గుండెలోతు గోసల్ని
తాళలేని తాపాన్ని
చూపలేని దైన్యాన్ని
ఆపలేని ఆవేశాన్ని
కానరాని కోపాన్ని
పెంచుకున్న ప్రేమని
తెంచలేని తలపుని

తొలకరి జడి వానలా
ఆకు మీద చినుకులా
వీచిన చిరు గాలిలా
విరబూసిన వెన్నెలలా
మగువ మేని సొగసులా
మెడనున్న ముత్యంలా
పసిపాపడి చూపులా
పాలనురగ నవ్వులా
పరుచుకున్న కాంతిలా
పట్టలేని పరువంలా
హత్తుకున్న హృదయంలా
హద్దేలేని మిన్నులా
మరువలేని మైత్రిలా
మరపు రాని జ్ఞాపకంలా

హాయిగా
తేనెలొలుకు మాటలా
మరిచిపోని పాటలా
మల్లెపూల తెలుపులా
తీరుతున్న కోరికలా
వ్యక్తపరుచు నేస్తమా
నీ గొంతునున్న భావన

★★★

## ఒంటిరెక్క మందారం
### కరణం కళ్యాణ్ కృష్ణకుమార్

నిన్ను నిశీథి గదుల మధ్య ఆక్రందనగా చూశాను
నిన్ను తెగిన విశ్వవీణ తంత్రిగా దర్శించాను
నిన్ను మెరుపులు నర్తించిన శిథిల మేనుగా తిలకించాను...
అయినా అదే సహనం నింపుకుని ఉషస్సై మేల్కొంటావు..
భూపాలానికి కొత్త పల్లవై ఒదిగిపోతావు
తెగిన నరాలపై ఉమ్మి లేపనం ..
ఆపై ఆచ్ఛాదన కప్పి అన్నీ దాచేస్తావు..

కాటేసిన కాలాన్ని ఎప్పటికప్పుడు నలిగిన పూలచెండు చేసి
చీపురుతో మూలకి నెట్టేస్తావు
జీవం చచ్చిన కంటి చెరువు కథలు..
కాటుకలా పులుముకుంటాయి..
మెత్తగ దిగిన క్షతాల కంటకాలు సలుపుతున్నా
పెదాల ప్రమిదలపై చిరు నవ్వు వెలిగిస్తావు

అవమానం నింపిన అనుమానపు బీజం అజ్ఞానంలో నాటిన
కలుపు మొక్కై తొలుస్తున్నా..
తెలిమంచు తెర తెంపుకుని..
యంత్రమై నలిగిపోతావు..

పరచుకున్న పగటిపై చీకటి ఉమ్మేస్తుంటే...
ఒంటి రెక్క మందారమై వణికిపోతావు..
యథా ప్రకారం తలవంచుకు చితైపోతావు..

అదే కథ శతాబ్దాలుగా ప్రపంచ పటంపై
స్పష్టాస్పష్ట రక్తచారికల చిత్రమై కంపుకొడుతోంది..
అదే వ్యథ ఏళ్ళకేళ్ళుగా...
గొంతు తెగిన మొండెమై వెక్కిరిస్తోంది. ★★★

## ముక్తకాలు
### ఆర్.ఎస్.వెంకటేశ్వరన్

జీవన సంద్రంలో
ఊహల పడవలపై ఊరేగకు
కష్టాల కెరటాలలో
ధైర్యం చుక్కాని జారిపోనీకు
ఆటుపోట్లు సహజమే
తీరానికి చేరేదాకా
అనుభవాలు భారమే
ఆనందం చిక్కే దాకా.

★★★★★

కష్టాల రాళ్ళు
తగిలితే తగలనీ
జీవిత గంధం చెక్క
మళ్ళీ మళ్ళీ అరగనీ
అనుభవాల చందనం
గుబాళిస్తుంది
ఆనందాల నందనం
వెల్లివిరుస్తుంది.

★★★

# రసరేఖలు శ్రీధర్ బచ్చోటి

పిన్నతనమున నిండుజాబిలిని చూసి
పులకరింతల హృదయముప్పొంగిపోయె
ఆకసమ్మున చుక్కలనరయునంత
ఏవొ లోకాల మది విహరించెనపుడు

ఇంద్రధనువును చూసి నా హృదయమెంతొ
పట్టలేనట్టి ముదమందు పరవశించె
రంగురంగుల వింటి వర్ణముల జూసి
చెంతనున్నట్లు మనసు కేరింతకొట్టె

శైశవానందములెపుడు శాశ్వతములు
జీవితమ్మెల్ల మనతోడ చేరియుండు
అంత యానందమీనాడు స్వంతమయ్యె
కన్నులార చెలియ! నినుగనినయంత

తారలైన శశియునింద్రధనువునైన
వేరులోకాల చెలువొందు వింతలవ్వి
చేతికందని దివ్యరోచిస్సులవ్వి
అమితమోదమ్ముగూర్చు చిత్తమునకెపుడు

దూరమౌదువొ దగ్గరుందువొ యెరుంగ
అయిన నీ యోచనలుగూర్చు హర్షశతము
ఇది యనిర్వచనీయమౌ హృదయగీతి
ఆలపింతును నీకొరకనవరతము

COMMENTS